క్లుప్తంగా

మురుగు కాల్వలను బాగు చేసేందుకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వలను బాగు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. అలాగే మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. ఆమె వెంట మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మార్చి 4 నుంచి సువార్త స్వస్థత ఉజ్జీవ సభలు

తెనాలిఅర్బన్: పీషోను మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో తెనాలిలో మార్చి 4వ తేదీ నుంచి 6 వరకు సువార్త స్వస్థత ఉజ్జీవ సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాస్టర్లు కె.మోషే, కె.పృధ్వీన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెంచుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గ్రౌండ్‌లో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు సభలు జరుగుతాయని చెప్పారు. విజయవాడకు చెందిన ప్రముఖ సువార్తికులు పాస్టర్లు చార్లెస్ జాకబ్, ఫిలిప్ జాకబ్‌లు వాక్య పరిచర్య చేస్తారన్నారు. క్రైస్తవులు అందరు పాల్గొనాలని కోరారు.

రక్షిత నీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



తెనాలిఅర్బన్: వీఎస్ఆర్ కళాశాల రోడ్డులోని రక్షిత మంచి నీటి ప్రధాన పైప్ లైన్‌కు గురువారం రాత్రి మరమ్మతులు చేపట్టారు. పైప్ లీకై మంచి నీరు వృధాగా పోతుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు మరమ్మతులకు చర్యలు చేపట్టారు. పైప్‌లైన్‌కు పడిన రంధ్రానికి మరమ్మతులు చేశారు. మరమ్మతుల కారణంగా నిలిపివేసిన మంచినీటి సరఫరాను శుక్రవారం పునరుద్ధరించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

నెలాఖరులోపు దుకాణాల వివరాలు నమోదు చేసుకోవాలి



తెనాలిటౌన్: కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దుకాణములు, వ్యాపార సంస్థలు నడిపేవారు ఈ నెల 29లోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ డి.వి.శివప్రసాద్ తెలిపారు. మారీసుపేటలోని కార్మికశాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. దుకాణాలు, సంస్థల చట్టం 1988 ప్రకారం తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలన్నారు. పట్టణ, రూరల్ గ్రామాల్లో రెన్యువల్ చేసుకోని దుకాణాలు, వ్యాపార సంస్థల యజమానులు గమనించాలని శివప్రసాద్ కోరారు.

భారతదేశ అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలో ప్రజాపోరు ప్రారంభమైంది. తొలుత స్థానిక కొత్తపేట శివాలయంలో ఆయన పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని ప్రజలు మూడోసారి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఏపీలో అభివృద్ధికోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, చరకా కుమార్ గౌడ్, పోతురాజు వెంకటేశ్వర్లు, కామేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ జైన్, బాబూరావు, మనోజ్, అనిల్, సత్యనారాయణ, వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి హరికథా గానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి, 79వ వర్ధంతి పురస్కరించుకొని శనివారం నుంచి మార్చి 3వ తేదీ వరకు హరికథ గానం నిర్వహించనున్నట్లు శ్రీ నారాయణ దాస కథాగాన కళాపరిషత్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన హరి కథ రాజహంస జయంతి సావిత్రి భాగవతారిణి నిర్వహణలో జరిగే హరికథా గానంలో సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

అందరినోట అదే.. ఎన్నికలకు సిద్ధం

బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యేలో పార్టీ నేతలు



ఎమ్మెల్యే శివకుమార్, గుంటూరు కోటేశ్వరరావుకు పార్టీ నేతల గజమాల

తెనాలి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా తెనాలి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సిద్ధం చేసే దిశగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించిన 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' సమావేశాలు శుక్రవారం కొనసాగాయి. స్థానిక ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో ఏర్పాటైన సమావేశానికి పట్టణ 3, 4, 6,15, 37, 38, 40 వార్డులకు చెందిన పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్‌లెవల్ ఏజెంట్లు హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, వీర్లపాటి విజయలక్ష్మి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు ఇతర నాయకులతో కలసి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నారు. రోజులాగానే వార్డుల్లో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో గరిష్టంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన విషయం తెలిసిందే. గత నాలుగేళ్ల 10 నెలల కాలంలో దాదాపు రూ.1,800 కోట సంక్షేమ లబ్ధిని అందించిన విషయం ఎమ్మెల్యే గుర్తుచేశారు. రికార్డుస్థాయిలో 27 వేల మంది పేదలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేయటం, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు గరిష్టంగా సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన వైనాన్ని తెలియజేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని చెప్పారు. ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు కాదనీ, భారీ మెజార్టీని సాధించటమే లక్ష్యమని నాయకులు హామీనిచ్చారు. పార్టీ నేతలు తులసీ భగవాన్, పసి, షేక్ సైదా, జానీ, మహేష్, నాని, పోతిరెడ్డి నాగరాజు, కన్నెగంటి గోపీచంద్, గోపి, మల్లిబోయిన రాము, ఎ.సిరికృష్ణ, బొమ్ము నాగిరెడ్డి, పెసర్లంక రమణ, మునిపల్లి వంశీ, షేక్ మీరావలి, కఠెవరపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని చిప్స్ కళాశాలలో చెన్నైకి చెందిన ఒమెగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరుకాగా మొత్తం 145 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. వారిలో తమ కళాశాలకు చెందిన 80 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులకు ఏడాదికి రూ 2.5 లక్షల వేతనం ఇస్తూ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ట్రజరర్ ఆర్ గోపాలకృష్ణలు అభినందించారు.

అనధికారికంగా మద్యం విక్రయిస్తే చర్యలు

కాకుమాను: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఎవరైన మద్యం విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవింద్ర అన్నారు. మండలంలోని పాండ్రపాడు శివారులో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైన మద్యం విక్రయిస్తే అటువంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి నుంచి ఆరు ఫుల్ బాటిల్‌ల మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవింద్ర తెలిపారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కోరారు. ఆయన్ను కుంచనపల్లిలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధిత పసుపు రైతుల ఐక్యకార్యాచరణ కమిటీ కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నష్టపోయిన పసుపు రైతులకు ప్రస్తుతమున్న మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వ నిధుల నుంచి లేదా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణమే ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు. అనంతరం స్పెషల్ అగ్రికల్చర్ కమిషనర్ సీహెచ్. హరికిరణ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కందుల వీరల్‌రెడ్డి, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య,హనోక్, పసుపు రైతులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం తిరుపతమ్మ తల్లి

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత శ్రీ తిరుపతమ్మ తల్లి అని పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం చల్లావారిపాలెం గ్రామం సీతమ్మ కాలనీలో గల శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయ 7వ వార్షిక కల్యాణ, వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. సమన్వయకర్త ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానం కార్యక్రమాన్ని సమన్వయకర్త ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

చలపతిలో ఉద్గోష్- 2024 ప్రారంభం

మోతడక(తాడికొండ): సమస్యలకు పరిష్కారం చూపే దిశగా విద్యార్థులు అడుగులేస్తే భావి ఇంజినీర్లుగా ఎదగడం సులభమే అని ఇండియన్ సర్వర్స్ సీఈవో సాయి సతీష్ అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఉద్ఘోష్-2024 టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చలపతి విద్యా సంస్థల కార్యదర్శి వై. సుజిత్ కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో లైక్‌లు, కామెంట్‌లకు స్వస్తి పలికి సమయాన్ని వృథా చేయకుండా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణల దిశగా ముందుకెళితే ఉద్యోగాల కోసం అన్వేషించకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగవచ్చని సూచించారు. విద్యా సంస్థల కార్యదర్శి వై. సుజిత్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు విద్యా రంగంలో వస్తున్న అధునాతన సాంకేతికతను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అనంతరం రిబ్బన్ కత్తిరించి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా హాజరైన సినీ హీరో అట్లూరి రక్షిత్ విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. శశివదన్ మూవీ టీజర్, పాటలు ప్రదర్శించి విద్యార్థులతో కలిసి డాన్స్ చేశారు. వివిధ క్రీడలలో గెలుపొందిన విజేతలకు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వి.ఆంజనేయులు, వై అనంత కుమారి, సుజిత్ కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. నాగ శ్రీనివాసరావు, ఉద్ఘోష్ కన్వీనర్లు సాయి శ్రీనివాస్, నాగ రవికిరణ్, కల్చరల్ అండ్ క్రీడా కో ఆర్డినేటర్లు బి. తులసీరాణి, డి. రాము, పి. బాలమురళీకృష్ణ, వివిధ శాఖాధిపతులు, , అధ్యాపకులు, పలు కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి

పట్నంబజారు: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ బి.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ హుస్సేన్ (25) శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులు తోట జయ ఆదిత్య, ఎన్. తరుణ్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి హుస్సేన్ నగర్‌వైపు వెళ్లారు. ఎం. కన్వెన్షన్ వద్ద డివైడర్ పక్కన నిలుచుకుని టర్నింగ్ తిప్పుకునే క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో మహబు హుస్సేన్‌కు తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. జయ ఆదిత్య, తరుణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియాల్సి ఉంది.

పాతూరులో అదుపు తప్పిన ఇసుక లోడు వాహనం

- మద్యం మత్తులో డ్రైవర్
- భారీగా ట్రాఫిక్ జామ్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన మరో సంఘటన
- ఇంట్లోకి దూసుకుపోయిన ట్రాక్టర్



అదుపు తప్పిన లారీ



ఇంటి గోడను ఢీకొట్టిన ట్రాక్టర్

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రేవల్లె కనకదుర్గ వారధి కరకట్ట వెంబడి పలు క్వారీల నుంచి వస్తున్న ఇసుక లారీలు, ట్రాక్టర్ల అతివేగానికి ఆ రహదారిలో రాకపోకలు సాగించే వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పాతూరులో శుక్రవారం ఓ ఇసుక లారీ డ్రైవర్, క్లీనరు ఫుల్‌గా మద్యం తాగి అతి వేగంగా నడపడంతో అదుపుతప్పింది. కరకట్ట కింద భాగంలో చెట్టు మొదలు ఉండడంతో దానికి ఆనుకుని లారీ నిలిచిపోయింది. లేదంటే కింద వున్న నివాసంలోకి దూసుకుపోయి పెను ప్రమాదం జరిగేది. లారీ డ్రైవర్‌ను స్థానికులు ప్రశ్నించగా డ్రైవర్, క్లీనర్ బూతులు తిట్టడం విశేషం. లారీ అదుపు తప్పడంతో రేవల్లె కనకదుర్గ వారధిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట ఇదే గ్రామంలో ఓ ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి ఇంట్లోకి దూసుకుపోవడంతో సామానులన్నీ ధ్వంసం అయ్యాయి. జరిగిన ఈ సంఘటనపై ట్రాక్టర్ యజమాని నష్టపరిహారం కూడా ఇవ్వలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఇసుక వాహనాల దూకుడుకు కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి శుక్రవారం ఆరు క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

2న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా సభ

ఫిరంగిపురం: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పిలుపు మేరకు మార్చి 2న గుంటూరులో నిర్వహిస్తున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా సభను జయప్రదం చేయాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రకాష్ కోరారు. మండలంలోని వేమవరం, 113 తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో డ్వాక్రా మహిళలు, గ్రామపెద్దలు, అంబేద్కర్ యువజన సంఘ నాయకులతో కలిసి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ మార్చి 2న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే సభకు దళిత మహాసభ అధ్యక్షుడు డాక్టర్ కత్తి పద్మారావు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో పి. రమేష్, చుక్కాబాబు, డి.శ్యామ్, మత్తయ్య, జక్కరయ్య, మార్తమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.

రైతుల బాధను అర్థం చేసుకోవడంలో కేంద్రం విఫలం



లక్ష్మీపురం: రైతుల బాధల్ని అర్థం చేసుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విశ్లేషణ సభలో ఆయన మాట్లాడారు. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని ఖానేరీ వద్ద ప్రస్తుత యుద్ధ వాతావరణం చూస్తే ప్రభుత్వ మొండి వైఖరి, నియంతృత్వ విధానాలు అర్థమవుతున్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ మాట్లాడుతూ కేంద్రం ఇప్పటికైనా రైతుల ఆవేదనని అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మురళి, సదాశివం ప్రసంగించారు.

వైభవంగా జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం మైనాక వాహనసేవ, శ్రీ సువర్చల హనుమత్ కల్యాణం వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ శాండిల్యా దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, అర్చకులు కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో సీఎల్‌పీటీ మేలోత్సవ్ 3.0



రిబ్బన్ కట్‌చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు

గుంటూరు రూరల్: ప్రతి మనిషికి దైనందిన జీవితంలో ఆటలు, వ్యాయామం ఎంతో ప్రముఖ్యత కలిగిన విషయాలని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమీషన్ సెక్రటరీ ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మశీ కళాశాలలో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయిలో జరగనున్న సీఎల్‌పీటీ మేలోత్సవ్ 3.0 కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్ననాటినుంచి క్రీడలు, వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. క్రమం తప్పకుండా ఇవి రెండుపాటిస్తూ మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, తగ్గించుకుని మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. ఏఎస్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.జాన్సన్ మాట్లాడుతూ క్రీడల ద్వారా జ్ఞాపకశక్తి, చురుకుదనం, పిజికల్ ఫిట్‌నెస్ పెరుగుతాయన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు ఆటలపై శ్రద్ధ పెరిగితే ఉత్సాహంగా విద్యలోనూ రాణిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈ మేలోత్సవ్ కార్యక్రమం రెండు రోజులపాటు జరుగుతుందని కార్యక్రమంలో వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, క్యారమ్స్, చెస్, రన్నింగ్(1500 మీ) వంటి 13 రంగాల్లో బాల బాలికలకు విడివిడిగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 16 కళాశాలల నుంచి విద్యార్థులు 482 మందికిపైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. క్రీడాకారులకు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన అవసరం

తాడేపల్లి రూరల్ : క్షయ వ్యాధి నివారణపై నర్సింగ్ విద్యార్థులంతా అవగాహన పెంచుకోవాలని దుగ్గిరాల ప్రభుత్వ వైద్యులు ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ సూచించారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడిలోని మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ మనిషిలో రోగనిరోధకశక్తి తగ్గితే అనేక రకాల వ్యాధులు వస్తాయని, ముఖ్యంగా క్షయవ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ ఉందని వివరించారు. వ్యాధి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధిగ్రస్తులు వాడే వస్తువులను మరొకరు వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి. రవికుమార్, పీఆర్వో హనుమాన్, కళాశాల సిబ్బంది సౌజన్య, తుమ్మపూడి ఎంఎల్‌హెచ్‌పీ అచ్యుత, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తి అరెస్ట్

చేబ్రోలు: అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తిని చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జీబీసీ రహదారి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఐ పి. మహేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. జీబీ నారాయణను అదుపులోకి తీసుకొని అతని వద్ద నిల్వ చేసిన 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ పి మహేష్ కుమార్ తెలిపారు.


వికసిత్ భారత్ విజయానికి విద్యార్థుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ రవి గుజ్జుల

గుంటూరు రూరల్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో పురోగతి సాధించుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు సులభతరమవుతాయని ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ గుజ్జల రవి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ 2047 విజన్ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన అగ్రదేశాలకు దీటుగా భారత దేశాన్ని ఉంచే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమం వికసిత్ భారత్ 2047 విజన్ కార్యక్రమం అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు అందిస్తున్న తోడ్పాటును వినియోగించుకోవాలని చెప్పారు. ది ఫ్యూచర్ ఈస్ నౌ షేపింగ్ ఏ డెవలప్డ్ ఇండియా త్రు ఐ టీ ఎనేబుల్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించి విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థుల నైపుణ్య అభివృద్ధిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ కార్యక్రమాల వివరాలను వివరిస్తూ భవిష్యత్తులో సాంకేతిక రంగ ప్రభావాన్ని ఆయన తెలియజేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 247 కళాశాలల్లో అతి తక్కువ సంఖ్యలో మాత్రమే మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు విద్యా బోధనా విధానం అందజేయబడుతుందని, మిగతా అధిక శాతం విద్యార్థుల్లో క్షీణిస్తున్న నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మారుమూల గ్రామీణ స్థాయి విద్యార్థుల వరకు ఫైబర్ నెట్ ద్వారా ఆన్‌లైన్ ప్రత్యక్ష విధానం ద్వారా స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ పబ్లిక్ ప్రైవేట్ సెక్టార్‌ల సంయుక్త సహకారంతో నిపుణులచే రూపొందించిన కార్యక్రమాలను అందిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని తమ కళాశాల అందుకోవడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో అతిథిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్‌విపి చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు ఘనంగా సన్మానించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు హ్యాపెన్ సంస్థ శుక్రవారం స్థానిక మిర్చి యార్డులో కళాజాత బృందాలతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ బాధితులతో వ్యవహరించే తీరు, హెచ్ఐవీ, టీబీ మధ్య ఉన్న సంబంధం గురించి కళాజాత ద్వారా వివరించారు. కార్యక్రమంలో హ్యాపెన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ జి.జయరాజు, ఏఎస్ఎం అమ్మాజీ, సురేష్ పాల్గొన్నారు.